ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 25 జనవరి 2024

పొదుపు సంఘాల్లో

అక్రమాలకు చెక్

సంఘాలు మరింత జవాబుదారీగా ఉండేలా కేంద్రం చర్యలు

లోకోస్ యాప్‌లో సంఘ సభ్యుల వివరాలు నమోదు

యాప్‌లో వివరాల నమోదులో జిల్లాకు నాలుగో స్థానం

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల్లో అక్రమాలకు నివారించడానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పొదుపు సంఘాలన్నింటినీ ఏకతాటి పైకి తెచ్చి మరింత జవా బుదారీగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ పొదుపు సంఘానికి ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించ నున్నారు. ఏ స్థాయి అధికారి అయినా ఆన్‌లైన్ ద్వారా పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధిని పరిశీలించే అవ కాశం కల్పించ నుంది. ఇందుకోసం లోకో స్ (లోక్ ఆపరేటింగ్ సిస్టం) పేరిట యాప్‌ను రూపొందించారు. వీలైనంత త్వరగా వివరాలు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం యాప్‌లో వివరాలను నమోదు చేయడంలో డీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు నిమగ్నమై ఉన్నారు. యాప్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలు, సభ్యుల వివరాలను నమోదు చేయడంలో ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగో స్థానంలో జగిత్యాల జిల్లా ఉంది.



జిల్లాలో 14,923 మహిళా సంఘాలు

స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల వివరాలను అధికారులు నిర్ణీత యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 14,923 మహిళా సంఘాలకు గానూ ఇప్పటివరకు 5,610 సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అదేవిధంగా జిల్లాలో 1,70,638 సభ్యులకు గానూ ఇప్పటివరకు 36,663 మంది సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేయడం పూర్తి అయింది. రాష్ట్రంలో మహిళా సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేయడం ప్రక్రియలో జగిత్యాల జిల్లా నాలుగో స్థానంలో ఉంది. రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, నిజామాబాద్ ద్వితీయ స్థానంలో, వరంగల్ తృతీయ స్థానంలో ఉన్నాయి. నాలుగో స్థానంలో జగిత్యాల జిల్లా ఉంది.

ప్రయోజనాలివి

పొదుపు సంఘాల సభ్యులు నిరక్షరాస్యులు కావడంతో కొన్ని గ్రామైక్య సంఘాల బాధ్యులు వారి పేరిట రుణాలు తీసుకొని అవసరాలు తీర్చుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ యాప్ వినియోగంతో దీన్ని నిలువరించే అవకాశం ఉంటుంది. సంఘాల సభ్యులు, ఉన్నతాధికారులు వివరాలను ఎప్పటికప్పుడు యాప్ ద్వారా చూసుకునే అవకాశం ఉంటుంది. యాప్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత ప్రతీ పొదుపు సంఘానికో గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. రాష్ట్రం జిల్లా, మండలం, గ్రామానికి ఒక్కో సంఖ్య కేటాయిస్తారు. ఈ సంఖ్యల ద్వారా అధికారులు ఆర్థిక వ్యవహారాలను గమనించే వీలుంటుంది.

వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు

గతంలో సభ్యులు బ్యాంకులకు వెళ్లి తమ పొదుపు, అప్పుల వ్యవహారాలను తెలుసుకునే వారు. ఇకపై ఇంటర్‌నెట్ ద్వారా సులువుగా తమ ఆర్థిక పరిస్థితిని మదింపు చేసుకొని ప్రణాళికను రూపొందించుకునే వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏ సంఘం ఎంత అప్పు తీసుకుంది. చెల్లించిన సొమ్ము ఎంత...ఇంకా ఎంత చెల్లించాలి..సంఘంలో సభ్యుల సంఖ్య ఎంత తదితర వివరాలను యాప్ ద్వారా తెలుసుకునే వీలుంటుంది.

ప్రత్యేకాధికారులుగా డీపీఎంలు

జగిత్యాల జిల్లాలో ఇంకా 9,300 సంఘాలు, 1,33,975 మంది సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని నిర్ణయించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంటున్నారు. ఇందుకోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డీపీఎంలకు మండలాలు కేటాయించారు. సంఘాల, సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించి గడువును నిర్దేశించినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.

లోకోస్ యాప్‌లో వివరాల నమోదు

నరేశ్, డీఆర్‌డీఓ, జగిత్యాల



లోకోస్ యాప్‌లో సభ్యుల వివరాలు, పేర్లు, ఆధార్ సంఖ్యలు, సభ్యుల బ్యాంకు ఖాతాల సంఖ్యలు, సభ్యత్వం తీసుకున్న తేదీ, తీసుకున్న అప్పులు, పొదుపు, రుణాలు చెల్లించిన తీరు (రుణ చరిత్ర) తదితర వివరాలను ఈ యాప్‌లో పొందుపరుస్తారు. ఇక నుంచి జరిగే ఆర్థిక లావాదేవీలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- మంత్రి కొండా సురేఖకు మోతే వాసుల వినతి

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మోతే గ్రామంలో గల మహంకాళి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు జగిత్యాల గౌడ కల్లు గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు వినతిపత్రం అందించారు. బుధవారం జిల్లాలోని జగిత్యాల, ధర్మపురిలలో మంత్రి సురేఖ పర్యటించిన సందర్భంగా ఆమెను కలిసి పలు సమస్యలను విన్నవించారు. దేవాలయ ప్రహరీ నిర్మాణానికి, నూతనంగా రెండు గదుల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రి సురేఖను శాలువతో సత్కరించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్, కొత్తకొండ అంజయ్య, గొల్లపల్లి నర్సయ్య, కాసారపు రాజాగౌడ్, కొత్తకొండ రవి, గొల్లపల్లి గౌతమ్, కొత్తకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడికోట ఆలయంలో కేంద్ర మాజీ మంత్రి పూజలు



అశోక గజపతిరాజును సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

రాయికల్, జనవరి 24: రాయికల్ పట్టణంలోని ప్రాచీన దేవాలయమైన గుడికోట శివాలయంలో కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సతీష్ శర్మ ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట హిమవంతరావు, కాటిపెల్లి గంగారెడ్డి, సురభి భూంరావు, సామల్ల వేణు, లక్ష్మీనారాయణ, శంకర్, రమేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా అశోక గజపతిరాజును రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు శాలువాతో సత్కరించారు.

నేడు జగిత్యాలలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జగిత్యాల, రాయికల్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జైలులో ఉన్న జగిత్యాల మండలం హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాయికల్ మండలం ఇటిక్యాల సాయిబాబ ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొంటారని ప్రకటించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- డాక్టర్ సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఎలాంటి యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో జిల్లాలోని 51 సహకార సంఘాల ద్వారా, డీసీఎంఎస్‌ల ద్వారా యూరియాను సరాఫరా చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జగిత్యాల జిల్లాకు 27,171 మెట్రిక్ టన్నుల యూరియా రావడంతో రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్‌లో 7,400 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్, ప్రయివేటు డీలర్ల వద్ద 3,340 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పీఏసీఎస్ చైర్మన్లు, మండల వ్యవసాయ అధికారులకు జాగ్రత్తలు వహించాలని సూచించారు. రైతులు అసత్య ప్రచారాలు నమ్మవద్దని, ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు.

ప్లాంటేషన్, నర్సరీ పనుల పరిశీలన

రాయికల్, జనవరి 24: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీ పనులను బుధవారం రాయికల్ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ పరిశీలించారు. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే రామాజీపేట రోడ్డులో ప్లాంటేషన్ పనులను ఆయన పర్యవేక్షించారు.

మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, జనవరి 24 : జిల్లా పర్యటనకు వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబును జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కలిసారు. బుధవారం కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి కొండా సురేఖను కలిసి పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం, టీటీడీ కల్యాణ భవన అభివృద్ధికి నిధులు కేటాయించాలని కొరారు. అనంతరం దుద్దిళ్ల శ్రీదర్ బాబును కలిసి స్థానికంగా ఉన్న పార్టీ పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, ఉపాధ్యాక్షుడు ఎంఏ నయీం, కార్యదర్శి ఎంబేరి సత్యనారాయణ నాయకులు సదుత వెంకటస్వామి, వశీం, శ్రీరాములు, అమరేందర్, నేమూరి భూమయ్య, అయిండ్ల గణేష్ పాల్గొన్నారు.

మార్కెట్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

మెట్‌పల్లి రూరల్, జనవరి 24: మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్ గ్రామాల్లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం స్థలంను జడ్పీ సీఈవో రఘువరణ్ పరిశీలించారు. బుధవారం వెల్లుల్ల గ్రామంలోని పల్లె ప్రకృతి, సంపద వనాలను ఎంపీడీవో భీమేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామాల్లోని రైతులు పండించిన కూరగాయాలను విక్రయించుకోవడానికి మార్కెట్ ఏర్పాటు కోసం అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో స్థలం పరిశీలించామన్నారు. అనంతరం మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం సందర్శించి మండలం లోని అభివృద్ధి పనుల గురించి ఎంపీపీ మారు సాయిరెడ్డి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో సర్పంచు గూడూరు రజిని-తిరుపతి, ఏపీవో తిరుపతిరావు, కార్యదర్శి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిని నియమించాలి

రాయికల్, జనవరి 24: రాయికల్ మండలంలోని అల్లీపూర్‌లో పశు వైద్యాధికారిని నియమించాలని కోరుతూ జిల్లా పశు వైద్యాధికారికి సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి బుధవారం వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో పశు వైద్యుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడిమ్యాల, జనవరి 24: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి లావణ్య తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతి చదివేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రస్తుత్తం ఐదో తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు, 7, 8, 9, 10వ తరగతుల్లో మిగులు సీట్ల ప్రవేశం పొందటానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బీరువాలు అందజేత

పెగడపల్లి, జనవరి 24: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం ప్రభుత్వ విప్ ద్వారా రెండు బీరువాలను అందజేశారు. ఇటీవల గ్రామానికి వచ్చిన విప్ లక్ష్మణ్ కుమార్‌ను అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్థులు బీరువాలు అందించా లని కోరారు. ఈ మేరకు పంపించిన బీరువాలను స్థానిక నాయకులు ఆయా కేంద్రాలకు అందజేశారు. పార్టీ నాయకులు దీకొండ తిరుపతి, బొడపట్ల ఐలయ్య, బలరాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుందర్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించడానికే ప్రజాపాలన

- రాష్ట మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు - అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో సమీక్ష





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు

జగిత్యాల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలన్న ఆలోచనతోనే ఇటీవల అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిందని రాష్ట్ర శాసన సభ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల, కోరుట్ల, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలతో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల యొక్క సమస్యలు, ఆవేదనను ప్రభుత్వం తెలుసుకోవడానికి హైదరాబాద్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నా రు. రాష్ట్రంలో పాలనలో మార్పు రావాలని కోరుకున్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదేవిధంగా ఇటీవల ప్రజాపాలన కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు నిర్వహించిన అధికారులను అభినందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల హామీని అమలు చేయడంలో భాగంగానే ప్రజాపాలన నిర్వహించామన్నారు. కాగా జగిత్యాల నియోజకవర్గంలోని బీర్పూర్ మండలంలో గల రోల్లవాగు ప్రాజెక్టు అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని, నూకపల్లి వద్ద జరుగుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● మంత్రి శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం..

రాష్ట్ర శాసన సభ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు బుధవారం జగిత్యాలలో ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి మంత్రిగా తొలిసారి వచ్చిన శ్రీధర్‌బాబుకు జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పూలమొక్కను అందించి స్వాగతించారు.

● ఉద్యోగ భద్రత కల్పించాలి..

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి సమస్యలను విన్నవించారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, వైద్య వసతి కల్పించాలని, వేతనాలను పెంపు చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకవెళ్లి పరిష్కరింపజేస్తానని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి కాంట్రాక్టు ఉద్యోగ సంఘ నాయకులు వంశీ, భీమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

● మంత్రిని కలిసిన టీజీవో నాయకులు..

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బుధవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలిసారిగా జగిత్యాలకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు గంగుల సంతోష్ కుమార్, రవి బాబు, నాయకులు రాజేందర్ రెడ్డి, విజేందర్, సలీం, రాజేశ్వరీ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర దేవాదాయ మంత్రి కొండా సురేఖ

ధర్మపురి, జనవరి 24: ధర్మపురి క్షేత్రాభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. స్థానిక శేషప్ప కళా వేదిక ఎదుట నిర్వహించిన సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ, సామవేద పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమంలో బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. లక్ష్మీనరసింహ స్వామి తమ ఇళ వేల్పు అంటూ తనకు మంత్రి హోదాలో ఇలాంటి దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. దేవాలయాలను అభివృద్ధి చేసే విషయంలో తాను వెనుకంజ వేయనని ఆమె పేర్కొన్నారు. ఆలయం పక్షాన స్వామి చరిత్ర గురించి ఒక డ్యాకుమెంటరీ తీయించి విస్తృతంగా ప్రచారం చేయించాలని ఆమె సూచించారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల భక్తుల సంఖ్య కూడ పెరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్టీసీ, టూరిజం శాఖతో కలిసి చర్చించి ముందు కు సాగుతామని ఆమె అన్నారు. ఇక్కడ వేద పాఠశాల ఏర్పాటు చేస్తామని వివరించారు.

● ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నా: శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని నరసింహుడిని వేడుకున్నట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. ఇందు కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం దేవాలయాల అభివృద్ధి గురించి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ధర్మపురిని టెంపుల్ సిటీగా మార్చి, ప్రజలకు తాగు నీరందించే విషయం లో శాశ్వత పరిష్కారం చేస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, సంస్కృత అకాడమీ డైరెక్టర్ కళోజ్జల నీలకంఠం, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, కటారి చంద్రశేఖర్‌రావు, జక్కు రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

● మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు పూజలు

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ఉదయం సందర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి సారిగా మంత్రుల హోదాల్లో వచ్చిన వారికి వేదపండితు లు, అర్చకులు, సిబ్బంది వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు ఇద్దరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అర్చకులు వారిని ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య కలిసి వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి సత్కరించారు. వారి వెంట ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ధర్మపురి శ్రీమఠం పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామి సందర్శించారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామి ప్రసాదాలు అందించారు. స్వామి వెంట వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ధర్మపురి నరసింహుని దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిలను ఆలయం పక్షాన స్వామి శేష వస్త్ర ప్రసాదాలు అందించి సత్కరించారు.



మంత్రి కొండా సురేఖను ఆశీర్వదిస్తున్న అర్చకులు

● ముగిసిన వేద పారాయణం, రుగ్వేద హవనం..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, రుగ్వేద హవనం, సామవేద పారాయణం ముగింపు కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, నూతన సీఎం రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండి, రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలని ధర్మపురి శ్రీమఠం పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామి దివ్య ఆశీస్సులతో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనలతో ఈ కార్యక్రమాలు చేపట్టారు. హైదరాబాద్ శ్రీ ప్రేమిక వరద, వేదపరిపాలన సభ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి వారం రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టారు. ఆఖరి రోజున ముగింపు సందర్భంగా పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించి కార్యక్రమాలు ముగించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు. వేదపారాయణం ముగింపు సందర్భంగా సామవేద పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం ముగింపు సందర్భంగా వేదపండితులను సన్మానించారు.






ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

● మొదటి రోజు 422 మందికి 382మంది హాజరు

తిమ్మాపూర్, జనవరి24: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ మెయిన్స్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు తిరిగి ఈ నెల 27,29,30,31, ఫిబ్రవరి 1 వరకు జరగనున్నాయి. మొదటి రోజు జిల్లాలో కేవలం మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఒకే సెషన్‌లో పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మిగతా రోజుల్లో రెండు సెషన్‌లలో పేపర్ - 1 పరీక్ష నిర్వహించనున్నారు. పేపర్-2లో భాగంగా బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు జరిగాయి.

ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు రెండు గంటల ముందు నుంచి 12.30గంటల నుంచి విద్యార్థు లను అనుమతించారు. విద్యార్థులు తమవెంట అడ్మిట్ కార్డును, ఫొటో తో కూడిన ధ్రువీకరణ కోసం గుర్తింపు కార్డులను పరిశీలించి అనంత రం లోనికి అనుమతించారు. బుధవారం జరిగిన పరీక్షలకు 422 మం దికి 382మంది విద్యార్థులు హాజరు కాగా 40మంది విద్యార్థులు పరీ క్షకు గైర్హాజరైనట్లు ఎన్‌టీఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలి పారు.



విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

జమ్మికుంట రూరల్, జనవరి 24: జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రామడుగు సంపత్‌రావు ఇంట్లో విద్యుదాఘాతంతో నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పొలం పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లగా కొద్ది గంటల వ్యవధిలోనే ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వస్తున్నాయని స్థానికులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన వారు వచ్చేసరికే ఇంట్లోని నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొత్తం దగ్ధం అయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని, రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కుమార్ కోరారు.

















'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అద్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అద్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఉగాది నుంచి ఆసరా పెన్షన్‌దారులకు నాలుగు వేలు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



శీలం సురేందర్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జనవరి 24: ఉగాది నుంచి ఆసరా పెన్షన్‌దారులకు నాలుగు వేల రూపాయలు అందిస్తామని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం జగిత్యాల మండలంలోని తిప్పన్నపేటలోని గంగమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధరూర్ గ్రామంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్, మాజీ ఎంపీటీసీ శీలం సురేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ధరూర్ క్యాంపు భూములను కాపాడటం వల్ల నేడు జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించగలిగామన్నారు. ఎడ్ల అంగటి ప్రాంతంలో రామాలయం కబ్జాగురైతే భూమిని కాపాడామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు చెందిన రూ. 14 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసిందని, అందులో కేవలం రైతుల కోసం రూ.4 లక్షల కోట్లైనా వెచ్చించలేదని ఎమ్మెల్సీ ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, శ్రీరాముల గంగాధర్, ఉపసర్పంచ్ శీలం మహేష్, కొలుగూరి మధుసూధన్‌రావు, కొలుగూరి శ్రీనివాస్‌రావు, మున్నూరుకాపుసంఘం అధ్యక్షుడు తిరుపతి, దేశవేని రాజేష్, ఉప్పులేటి శ్రీనివాస్, బాలె హన్మంతు, మారవేణి గంగాధర్, ఒగులాపురం ఎర్రయ్య, వార్డుసభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను బుధవారం జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ కలిశారు. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లో కేటీఆర్ పర్యటించిన సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వసంత సురేశ్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కొడిమ్యాల ఎస్సై బదిలీ

జగిత్యాల టౌన్, జనవరి 24:కొడిమ్యాల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె. వెంకట్‌రావును డీసీఆర్‌బీకి అటాచ్ చేస్తు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. బదిలీకి గల కారణాలు తెలియరాలేదు.

పుస్తకావిష్కరణ చేసిన మంత్రులు

ధర్మపురి, జనవరి 24: ధర్మపురి క్షేత్రవాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ గొల్లపల్లి గణేష్ రచించిన అంతర్జాలంలో తెలుగు భాషాసాహిత్యాలు అనే పుస్తకాన్ని మంత్రి సురేఖతో కలిసి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంటర్నెట్‌లోని వెబ్‌సైట్లు, బ్లాగులు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధిని గురించి పుస్తకంలో చర్చించడంపై పలువురు రచయితను అభినందించారు. క్షేత్రానికి వచ్చిన మంత్రులకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పలువురు మంత్రులకు వినతి పత్రాలు అందించారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను అధికారులు మంగళవారం కొనసాగించారు. ఎస్సారెస్పీ సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 54.955 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 11,159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 300 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 491 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాలువకు ఐదు వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. యాసంగి పంట నీడి విడుదల ప్రణాళిక ప్రకారం ఈనెల 24వ తేదీ నుంచి కాకతీయ కెనాల్ (ఎల్‌ఎండీ పైన) జోన్-2 పరిధిలోని ఆయకట్టు వినియోగం కోసం 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పల్లెల అభివృద్ధి

- సర్పంచుల సేవలు మరవలేనివి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జనవరి, 24 : పల్లెల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమంతోనే సాధ్యమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌బీ రెస్టారెంట్‌లో నియోజక వర్గ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో పాటు ఆయన పాల్గొన్నారు. సర్పంచులను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచులకు గుర్తింపు కల్పించి గౌరవ వేతనాలతో పాటు నిధులు మంజూరు అందించిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. గత 60 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర సంవత్సరాలలో జరిగిందన్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పల్లెల్లో అభివృద్ధి పనులు సర్పంచుల చేత చేయించడం మాజీ సీఎం కేసీఆర్ వల్లేనే సాధ్యమైందన్నారు. గ్రామాల్లోని చెత్తను తీసుకెళ్లడానికి కనీసం బండ్లు లేని పంచాయతీలకు ట్రాక్టర్లును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు మంజూరు కోసం సమష్టిగా పోరాటం చేసి సాధించుకుందమన్నారు. సర్పంచుల సహకారంతోనే నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలవడం జరిగిందన్నారు. సర్పంచులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారన్నారు.

కోరుట్ల రూరల్: గ్రామల అభివృద్ధిలో సర్పంచ్ పాత్ర గొప్పదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం కోరుట్ల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఆత్మీయ సమేళనం ఏర్పాటు చేసుకోగా వారిని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌లు సన్మానించి జ్ఞాపికలను అందించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు కండ్లపల్లి విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగసుధారాణి

జగిత్యాలరూరల్, జనవరి 24: ఇటీవల జనగామ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ -14 కబడ్డీ పోటీల్లో జగిత్యాల మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన శాన్వి అనే విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగసుధారాణి తెలిపారు. ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో శాన్వి పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపల్ నాగసుధారాణి, వైస్ ప్రిన్సిపల్ రవీందర్, ఉపాధ్యాయ బృందం పీడీ వినీత్, అజీమ్‌లు అభినందించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

జాతీయ బాలికల దినోత్సవంలో సీడీపీవో వీరలక్ష్మి

జగిత్యాల రూరల్, జనవరి 24: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని ధర్మారం, లక్ష్మీపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు విద్య పట్ల నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. విద్యార్థినులకు బాల్యవివాహాలు, వరకట్నం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: ఆడపిల్లలను రక్షించుకుంటూ, వారిని అత్యుత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు వారిని చదివించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అర్బన్ అంగన్‌వాడీ టీచర్లు బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలకు సంపూర్ణ సాధికార తను ఇవ్వాలని, వారికి సమాన అధికారులు, అవకాశాలు ఇచ్చినప్పుడే సమాజంలో సగమైన మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష లేకుండా వారిని చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దయావతి, యతీశ్వరీ, నీలవేణి, రజిని, అంజమ్మ, కళావతి, మమత తదితరులున్నారు.

బీర్‌పూర్: మండలంలోని రేకులపల్లిలో గల ముఖ్య అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు ఉన్నత చదువులు చదవాలన్నారు. సమాజంలో ఏవిధంగా ముందుకు వెళ్లాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై చిన్నారులకు సూపర్‌వైజర్ నీలిమ, అంగన్‌వాడీ టీచర్ రేవతి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పు మడుగులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ విద్యాలయం లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా బాలికా విద్య ప్రాముఖ్యం, బాల్య వివాహాలు మొదలగు విషయా లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, రంగోళి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్య క్రమం లో ప్రత్యేకాధికారి ఎన్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడీ టీచర్ కాంతమ్మ, తల్లులు ప్రతిజ్ఞ చేశారు. అంతకు ముందు అంగన్ వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి..

మల్లాపూర్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ సూచించారు. బుధవారం మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ సేవ సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలకల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టిసారించి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసి వారి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కలిక్, ఎస్సై నవీన్‌కుమార్, న్యాయవాదుల అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, నల్ల రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రెండు ఎంపీ సీట్లు కూడా రావు

- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

జగిత్యాల టౌన్, జనవరి 24: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రెండు ఎంపీ సీట్లు కూడా రావని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు స్థానిక అన్నపూర్ణ చౌరస్తా నుంచి స్వాగతం పలుకుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఆర్థిక క్రమశిక్షణతో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. అసలుసిసలైన ప్రజాప్రభుత్వం మాది అని, బీఆర్ఎస్ నేతల కల్లాబొల్లి మాటలు ప్రజలు పట్టించుకోరన్నారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్లలో చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందని తెలిపారు. మిషన్ భగీరథ పథకం పేరుతో రూ. 45 వేల కోట్ల నిధులను బీఆర్ఎస్ సర్కారు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు సరైన సమయాల్లో రాలేవని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడ్డ కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన జరిపారని వివరించారు. ఫలితంగా సుమారు 40 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ గొప్పతననానికి ఉదాహరణ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఇంగ్లీష్ రాదని సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కాగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మనస్సులో లేకున్నప్పటికీ అధిష్ఠానంతో మాట్లాడి పార్లమెంట్ ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నిజమైన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగ్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, గిరి నాగభూషణం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును గజమాలతో సన్మానిస్తున్న నేతలు

'నవ్య' లో వీడ్కోలు హంగామా

జగిత్యాల అర్బన్, జనవరి 24: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ మాట్లాడుతూ ఆడపిల్ల జననం ఒక వరమని, ప్రస్తుతం సమాజంలో మహిళలు ముందుంటున్నారన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థినులను సత్కరించారు. నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బైపాస్ సర్వేను అడ్డుకున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 24: మండలంలోని బండలింగాపూర్, వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాల మీదుగా 63వ జాతీయ రహదారి కోసం అధికారులు సర్వే చేస్తుండగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. గ్రామాల్లోని విలువైన వ్యవసాయ భూములు ఇచ్చేది లేదంటూ బుధవారం భూ సర్వేను నిలిపి వేయాలని వ్యవసాయ భూముల వద్ద రిలే నిరహార దీక్షను రైతులు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో, జిల్లా స్థాయి సర్వేయర్లు అక్కడికి చేరుకొని రైతులను సమదాయించే ప్రయత్నం చేసినా రైతులు వినకపోవడంతో సర్వేను నిలిపివేసి వెనుతిరుగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బైపాస్ నిర్మాణానికి విలువైన వ్యవసాయ భూములు ఇచ్చేది లేదన్నారు. ఇప్పటికే చాలాసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు కోరినా భూసర్వేను నిలిపివేయకపోవడంతో రిలే నిరాహార దీక్షను చేపట్టినట్లు రైతులు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

వెల్గటూర్, జనవరి 24: బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కుమ్మరిపల్లి కస్తూరిభాగాంధి బాలికల విద్యాలయంలో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 103 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 29 మంది బాలికలకు ఎనీమియా బారిన పడినట్టు గుర్తించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి దీప, డాక్టర్ విజయ్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎం అంజలి, ఫార్మాసిస్ట్ సంధ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం

బీర్‌పూర్,జనవరి 24: కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని మంగేళలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ వరదల కారణంగా దెబ్బతినగా లిఫ్టిరిగేషన్ పునఃనిర్మాణం చేసి లిఫ్టును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్నా లిఫ్టులు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కరెంట్ స్తంభాలు భాగుచేసుకున్నామన్నారు. రోళ్లవాగు పాజెక్టులో గేట్లు బిగించే పనిమాత్రమే మిగిలి ఉందన్నారు. ముందుగా తుంగూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెక్కపెల్లి సత్యం తండ్రీ చెక్కపెల్లి చంద్రయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు నారపాక రమేష్, ఎస్సారెస్పీ డీఈ చెక్రునాయక్, మంగేళ సర్పంచ్ ఛుంచు శారధ నరేందర్ ఉన్నారు.

అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దు

మెట్‌పల్లి, జనవరి, 24: రాష్ట్రంలో అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దు వారు చేసే అసత్య ప్రచారలను తిప్పికొట్టుతూ అభివృద్ధి గురించి ఆలోచన చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాతసత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమైందన్నారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని చైర్‌పర్సన్ సుజాత పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణాభివృద్ధి మాజీ ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ల సహకారంతోనే జరిగినందున మేము అంత కూడా వారి వెంటానే ఉంటామని కౌన్సిలర్లు తీర్మాణం చేసుకున్నారు. అసత్య ప్రచారాలకు లొంగమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కోరుట్ల మున్సిపల్ సమావేశం

కోరుట్ల, జనవరి 24: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎజెండా అంశంలోని మొదటి అంశంపై కౌన్సిలర్ ఆడెపు కమల తప్పుపట్టి అధికారులను ప్రశ్నించారు. జనరల్ ఫండ్‌లో డబ్బులు లేక మున్సిపల్‌లో పని చేస్తున్న సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులకు జీతాలు లేక ఇబ్బంది ఎదుర్కొంటే కమీషన్లకు కక్కుర్తి పడి పట్టణ ప్రగతి కార్యక్రమంలో సాధారణ నిదుల నుంచి రూ. 7,50,000 పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణకు కేటాయంచడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనికి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ చైర్మన్ గడ్డమీది పవన్‌లతో పాటు సభ్యులు మద్దతు పలికి ఎజెండా నుంచి తొలగించాలని పట్టుబట్టారు. మరో మూడు అంశాలను సభ్యులు ఏకగ్రీవ తీర్మానం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. సభ్యుల సహకారంతో పట్టణం సమగ్రాభివృద్ధి దిశగా నడిపిద్దామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, డీఈఈ అభినయ్, ఏఈ లక్ష్మి, టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, మేనేజర్ శ్రీనివాస్, గజానంద్, జేఏవో శివ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలోపు 'భగీరథ' పనులు పూర్తి చేయాలి..

మెట్‌పల్లి: పట్టణంలో మంచినీటి సమస్యలు ఉండకుండా వేసవిలోపు మిషన్ భగీరథ పనులను పూర్తి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులకు సూచించారు. బుధవారం మెట్‌పల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ రానావేణి సుజాతసత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని 2వ వార్డులో శ్మశానవాటికలో బోరు రిపేరు, కరెంట్ హైటెన్షన్ వైర్లను షిఫ్ట్ చేయాలని కౌన్సిలర్ యామ రాజయ్య కోరారు. 18వ వార్డులో డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని, కొత్త పెన్షన్లను ఇప్పించాలని కౌన్సిలర్ చెట్లపెల్లి మీనా కోరారు. 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య మాట్లాడుతూ మంజూరైన 10 కోట్ల నిధులతో శ్మశాన వాటిక, వెంకటేశ్వర గుండువరకు సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, వెల్లుల్ల రోడ్డులోని శ్మశాన వాటిక వద్ద కరెంటు ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. నాలుగో వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్ విధులకు సక్రమంగా రావడం లేదని కౌన్సిలర్ పురుషోత్తం వివరించారు. 5వ వార్డులో పాఠశాలలో అదనపు తరగతి గదులు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కిషోర్ విన్నవించారు. కౌన్సిలర్లు తెలిపిన సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించేందుకు దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సమావేశంలో ప్రవేశపెట్టిన తొమ్మిది అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషి చేయాలని, ఎన్నికల వేల నిలిచిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. వేసవి రాకముందే భగీరథ నీటి సరఫరాలోని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు నిబద్ధతతో పని చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

పాఠశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన

జగిత్యాల అర్బన్, జనవరి 24: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లోగల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రవాణాశాఖ అధికారి వంశీధర్ హాజరయ్యారు. మాసోత్సవాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ ప్రమాదాల నివారణ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ప్రమీల, కాశీం ప్రిన్సిపాల్ జ్యోతి, కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఫిరోజ్, మధుకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

- పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో గల స్లేట్ హైస్కూల్‌లో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమిలో చిరుత పాదం గుర్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 24: మండలంలోని మేడిపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని వ్యవసాయ భూమిలో చిరుత పులి పాదం గుర్తులు బుధవారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ సమీపంలో ఉన్న పీసు భూమయ్య అనే రైతు వ్యవసాయ తోటలో పాదం గుర్తులు కనిపించగా చిరుత పులిగా భావించి అటవీ శాఖ అధికారులకు సమచారం అందించారు. డీఆర్‌వో మహ్మద్ హఫీజ్‌ద్దిన్, బీట్ అధికారి శివరాజ్, రత్నాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత పులి అడుగులను పరిశీలించారు. ఇది హైన(తోడెలు) జంతువులాగ ఉందని, చిరుత పులులు కాదని అధికారులు పేర్కొన్నారు. ఏ జంతువు అనేది గుర్తించేందకు అటవీ పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నాట్లు మహ్మద్ హఫిజోద్దీన్ తెలిపారు. పదిహేను రోజులుగా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తూ కనిపించిండంతో ఆయా గ్రామాల్లోని రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ప్రదేశంలో నిఘా పెడుతామని ప్రజలు భయాందోళనకు గురికావొద్దని అటవీ అధికారులు సూచించారు. చిరుత కనిపిస్తే సమచారం అందించాలని రైతులుకు సూచించారు.



వ్యవసాయ భూమిలోని గుర్తులు

సంక్షిప్త సమాచారం..

గొల్లపల్లి: మండలంలోని బొంకూర్, చెందోళి, దట్నూర్ గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించారు. కో ఆర్డినేటర్ కట్ట మహేష్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వెల్గటూర్: వెల్గటూర్‌లో దొరిశెట్టి వెంకటయ్య సతీమణి దొరిశెట్టి శంకరమ్మ మరియు కుమారుడు సతీష్ జ్ఞాపకార్థం నిర్వహించిన ధర్మపురి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో నిర్మించిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన ఏనుగు రవీందర్‌రెడ్డిమాధురి దంపతులు, ఏనుగు లక్ష్మారెడ్డిభువనశ్రీ దంపతులు 1,00,116 రూపాయల నగదును విరాళంగా అందించారు.

కథలాపూర్: మండల పరిషత్ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టే పనులకు ప్రణాళికలు రూపొందించే బీపీడీపీ కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జనార్దన్, ఎంపీపీ జవ్వాజి రేవతి పాల్గొన్నారు.

- మండలంలోని ఊట్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు బొలిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి మూడు వేల రుపాయల విలువైన పుస్తకాలను బుధవారం అందించారు.

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో గ్రంథాలయంలో అదనపు పుస్తకాలు ఏర్పాటు చేయగా వాటిని కళాశాల ఉపన్యాసకులకు ఆర్‌డీఓ రాజేశ్వర్ అందించారు.

- కోరుట్ల పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్వర్‌కు కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం వినతిపత్రం అందించారు.

- కోరుట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్యారేజీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవర్ డే వేడుకలో ఎంవీఐ రంజిత్, ఎస్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ వేదవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లను సన్మానించారు.